సాక్షి చిత్తూరు

బుధవారం । 10 । ఏప్రిల్ । 2024



'ఈవీఎం' అనే నేను..

ఎన్నికలను సులభతరంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఈవీఎంలను వినియోగిస్తోంది. - 8లో



'కోడ్' నిబంధనలు బేఖాతర్!

ఎన్నికల కోడ్ నిబంధనలను టీడీపీ నేతలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. అధికారులు పట్టించుకోవడంలేదు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ బుధవారం(సా)

చిత్తూరు 6.30

పుంగనూరు 6.32

న్యూస్‌రీల్

అవినీతికి ఆద్యుడు చంద్రబాబు



డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : దేశంలోనే అతిపెద్ద అవినీతి చక్రవర్తి, రాష్ట్రంలో అవినీతికి ఆద్యుడు చంద్రబాబే అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్పష్టం చేశారు. మంగళవారం ఎస్‌ఆర్‌పురంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అధికారం కోసం దేశంలో ఎన్ని పార్టీలూ ఉన్నాయో అన్నిటితోనూ జతకట్టడానికి చంద్రబాబు వెనకాడరని విమర్శించారు. 14 ఏళ్ల పాటు పాలించినా ఆయన పేరు చెబితే ఒక్క పథకం కూడా గుర్తుకురాదన్నారు. కరువు, కబ్జాలు, దోపిడీ, వెన్నుపోటు, నిరంకుశత్వం మాత్రమే గుర్తుకు వస్తాయని ఆరోపించారు. అదే జగనన్న పేరు చెబితే నవరత్న పథకాలు, వలంటీర్ వ్యవస్థ, సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, ఆరోగ్యశ్రీ వంటివి గుర్తుకు వస్తాయని వెల్లడించారు. మ్యానిఫెస్టోలో పెట్టిన 99 శాతం హామీలను అమలుచేసి ఎన్నికలకు వెళుతున్నామని, దొంగ హామీలతో కూటమి పార్టీలు వస్తున్నాయని వివరించారు. మీకు మంచి జరిగి ఉంటేనే మాకు ఓటేయండి అని చెప్పిన దమ్మున్న నేత జగనన్న అని కొనియాడారు. ఓటమి భయంతోనే చంద్రబాబు పొత్తులతో వస్తున్నారని, అయినప్పటికీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

కనిపిస్తే కండువా..!




గుడి వద్ద మహిళలకు కండువాలు వేసిన టీడీపీ నేతలు

కుప్పం : ఇష్టాయిష్టాలతో పనిలేదు.. అనుమతి తీసుకునే సంస్కారం లేదు.. ఎవరైనా కనిపిస్తే చాలు టీడీపీ నేతలు తమ పార్టీ కండువా కప్పేస్తున్నారు. ఒప్పుకుంటే సరే.. లేకుంటే బలవంతంగా అయినా పచ్చ కండువాలు చుట్టేస్తున్నారు. సోమవారం గుడుపల్లె మండలం గుండ్లసాగరం పంచాయతీలో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం. ఆదివారం గుండ్లసాగరంలో 35 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఇది జీర్ణించుకోలేని టీడీపీ నేతలు సోమవారం గ్రామ సమీపంలోని గుడికి పూజలు చేసేందుకు వెళ్లిన మహిళలన బెదిరించి కండువాలు కప్పేశారు. 10 కుటుంబాల వారు టీడీపీలో చేరినట్లు ప్రచారం మొదలెట్టేశారు. దీనిపై సదరు మహిళలు అంబికమ్మ, రాణెమ్మ, కృష్ణమ్మ మాట్లాడుతూ గంగమ్మ గుడికి వెళితే వద్దన్నా వినకుండా టీడీపీ నేతలు కండువాలు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కోడ్ అమలులో ఉన్నందును గుడి వద్ద పార్టీలో చేరికలు లాంటి కార్యక్రమాలు చేపట్టకూడదు. అయితే టీడీపీ నేతలు నిబంధనలను సైత అతిక్రమించారు. దీనిపై ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 61,920 మంది స్వామివారిని దర్శించుకోగా 17,638 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.55 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టోక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టోక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టోక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

టీటీడీ జేఈఓ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన గౌతమి

తిరుపతి(అలిపిరి): టీటీడీ జేఈఓ(ఆరోగ్యం–విద్య)గా ఎం.గౌతమి మంగళవారం స్థానిక టీటీడీ పరిపాలనా భవనంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. జేఈఓ వీరబ్రహ్మం, టీటీడీలోని పలువురు అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అతివకు ఆసరా



లబ్ధిదారులకు మెగా చెక్ అందిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి (ఫైల్)

ఆడపడుచులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలి.. సొంతంగా సాధికారత సాధించేందుకు చేయూతనందించాలి.. ఆర్థిక స్వావలంబన దిశగా ప్రోత్సహించాలి.. ఎవరిపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా భరోసా కల్పించాలి.. స్త్రీశక్తి విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పాలి.. ఇదే లక్ష్యంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో కార్యాచరణ అమలు చేసింది.. విప్లవాత్మకమైన సంక్షేమ పథకాలతో తోడ్పాటు నందించింది.. అందులో భాగంగా 'వైఎస్సార్ ఆసరా' కింద స్వయం సహాయక సంఘాలను రుణవిముక్తం చేస్తూ నాలుగు విడతల్లో ఆర్థిక సాయం అందజేసింది.. అవినీతికి తావులేకుండా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసింది. సర్కారు అండగా నిలవడంతో డ్వాక్రా మహిళలు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు దూసుకుపోతున్నారు. నూతన వ్యాపారాలకు శ్రీకారం చుట్టి తమ కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు.



కార్వేటినగరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మహిళలు ఆర్థిక సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్నారు. ఇదివరకు కూలి పనులపై ఆధారపడి జీవనం సాగించిన వారు సైతం ఇప్పుడు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

ఆంక్షలు లేకుండా

గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందేందుకు, పొందిన తర్వాత వివిధ రకాలు ఆంక్షలు అమలు చేసేవారు. పథకం కోసం దరఖాస్తు చేసుకునేందుకు సైతం డెడ్ లైన్ పెట్టేవారు. దీంతో అర్హులు కూడా లబ్ధి పొందేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులను పూర్తిగా మార్చేశారు. దరఖాస్తుకు గడువు లేకుండా చేశారు. అర్హులైన వారు ఎప్పుడైనా పథకం కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఈ క్రమంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద మహిళలకు ఆంక్షలు లేకుండా చేయూతనందించారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన సొమ్మును లబ్ధిదారుని అనుమతి లేకుండా వారి వ్యక్తిగత అప్పులకు జమ చేసుకోకూడదని స్పష్టంగా బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేశారు. సదరు నగదును మహిళలు ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎలాంటి అవసరానికైనా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

ఆర్థిక పురోగతికి బాటలు

వైఎస్సార్ ఆసరా పథకంతో మహిళల ఆర్థిక పురోగతికి ప్రభుత్వం బాటలు వేసింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళలను రుణ విముక్తుల్ని చేసేందుకు దోహదపడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం స్వయం సహాయక సంఘాల అప్పులను నాలుగు విడతల్లో చెల్లించే బృహత్తర కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా అమలు చేశారు.

బాబు హయాంలో దగా!

డ్వాక్రా రుణమాఫీ పేరుతో 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. చంద్రబాబు మాటలు నమ్మి బ్యాంక్ రుణాలు చెల్లించని ఎందరో మహిళలు డిఫాల్టర్లుగా మారిపోయారు. మరింతగా అప్పుల ఊబిలో కూరుకుపోయారు. డ్వాక్రా సంఘాలు నిర్వీర్యంగా మారిపోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మహిళా సంఘాలు మళ్లీ పుంజుకున్నాయి. వైఎస్సార్ ఆసరా పథకం కింద ఆయా సంఘాలను రుణ విముక్తం చేయడంతో ఆర్థికంగా నిలబడ్డాయి.

సాఫీగా జీవనం



డ్వాక్రా సంఘం ద్వారా రూ.1.55 లక్షల రుణం పొందా. నాలుగు విడతల్లో రుణమాఫీ కావడంతో కంతులవారీగా వేసిన మొత్తాన్ని జెరాక్స్ వ్యాపారానికి పెట్టుబడిగా పెట్టా. రోజుకు రూ. వెయ్యి చొప్పున ఆదాయం సంపాదిస్తున్నా. గతంలో మా కుటుంబం ఆర్థికంగా తీవ్రంగా ఇబ్బంది పడేది. ఇప్పుడు సాఫీగా జీవనం సాగిపోతోంది. ఏ ప్రభుత్వం కూడా ఈ స్థాయిలో సాయం చేయలేదు. సంతోషంగా ఉంది.

– శాంతి, పాదిరికుప్పం, కార్వేటినగరం మండలం

మహిళలకు పెద్దపీట



ముఖ్యమంత్రి జగనన్న అన్ని పథకాల్లోనూ మహిళలకు పెద్దపీట వేశారు. నేను ఇప్పటి వరకూ వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతలుగా రూ.22 వేల లబ్ధి పొందా. ఈ డబ్బుతో స్త్రీనిధిలో కొంచెం నగదు తీసుకుని పాడి పశువు కొనుగోలు చేసుకున్నా. ప్రస్తుతం నెలకు రూ.10వేల వరకు ఆదాయం వస్తోంది. దీంతో మా కుటుంబానికి వెన్నుదన్నుగా నిలబడే అవకాశం వచ్చింది.

– లక్ష్మి, కనికాపురం, పాలసముద్రం మండలం

మేలు మరువలేం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణమాఫీ చేశారు. నాలుగు విడతలుగా నాకు రూ.60 వేలు వచ్చింది. అలాగే వీవీలో రూ.50 వేలు అప్పుగా తీసుకుని రెండు పాడి ఆవులు కొనుగోలు చేసుకున్నా. అమూల్ సంస్థకు పాలు పోయడంతో నెలకు రూ.12 వేల నుంచి రూ.15 వేలు ఆదాయం సమకూరుతోంది. రైతుభరోసా, అమ్మ ఒడి తదితర పథకాల ద్వారా కూడా మాకు లబ్ధి చేకూరింది. మా కుటుంబానికి ఇంతగా సాయం చేసిన జగనన్న మేలు మరువలేం.

– మునెమ్మ, వత్తులూరు, కార్వేటినగరం మండలం

రుణపడి ఉంటాం



వైఎస్సార్ ఆసరా కింద నాలుగు విడతల్లో రూ.32వేల వచ్చింది. ఉన్నతి పథకం కింద రూ.50వేలు తీసుకుని మా గ్రామంలోనే కిరాణా దుకాణం పెట్టుకున్నా. నెలకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఆదాయం వస్తోంది. అలాగే మాకు అమ్మఒడి, రైత భరోసా కింద కూడా లబ్ధి చేకూరింది. ఒకప్పుడు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మా కుటుంబానికి జగనన్న ప్రభుత్వంలో ఎంతో సాయం అందింది. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– ముత్తమ్మ, 50 బసివిరెడ్డిపల్లె, ఎస్ఆర్‌పురం మండలం

ఎలాంటి అప్పులు లేవు



ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగనన్న డ్వాక్రా రుణమాఫీ చేశారు. ఆసరా పథకం ద్వారా నాకు నాలుగు విడతల్లో రూ. 36 వేలు వచ్చింది. ఒక్కో విడత అందిన డబ్బులతో ఒక్కో మేకను కొనుగోలు చేశా. ఒక్కో మేక రెండు పిల్లలు ఈనడంతో మంద తయారైంది. మేకలతో పాటు మేక ఎరువుకు ఎక్కువ డిమాండ్ ఉండడంతో రెండు వైపులా ఆదాయం వస్తోంది. ఇప్పుడు మాకు ఎలాంటి అప్పులు లేవు. ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా ఇల్లు కూడా నిర్మించుకున్నాం. ఆనందంగా జీవనం సాగిస్తున్నాం.

– సి.శారద, విదిదిపల్లె, పెనుమూరు మండలం

భరోసా కల్పించారు



జగనన్న అందించిన నాలుగు విడతల రుణమాఫీతో నాకు రూ.20 వేలు వచ్చింది. ఎస్‌హెచ్‌జీలో స్త్రీనిధి కింద రూ.50 వేలు అప్పుగా తీసుకున్నా. మొత్తం సొమ్ముతో పొట్టేళ్లు కొనుగోలు చేసుకున్నా. వాటి క్రయవిక్రయాలతో వచ్చిన ఆదాయం ద్వారా దర్జాగా బతుకుతున్నాం. జగనన్న మా కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారు. ఆయన మేలును ఎన్నటికీ మరువలేం.

– సి.నాగభూషణమ్మ, విదిదిపల్లె, పెనుమూరు మండలం

వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ



వైఎస్సార్‌సీపీలో చేరిన వీఎస్ఎస్‌పురం నేతలతో మంత్రి రోజా

పుత్తూరు : జిల్లాలోని పలు నియోజకవర్గాల్లోని టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. అందులో భాగంగా మంగళవారం పుత్తూరు రూరల్ మండలం తడుకు, విద్యుత్ సదాశివపురం గ్రామాలకు చెందిన నాయకులు నగరిలో మంత్రి రోజా చేతులుమీదుగా పార్టీ కండువాలు కప్పుకున్నారు. పార్టీలో చేరిన తడుకు టీడీపీ మాజీ వార్డు మెంబర్ హనుమంతయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, మంత్రి రోజమ్మ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి వచ్చినట్లు తెలిపారు. మంత్రి రోజా పార్టీలకు అతీతంగా పనిచేశారని, కోవిడ్ సమయంలో విశేషంగా సేవలందించారని వివరించారు. రాబోయే ఎన్నికల్లో మంత్రి రోజమ్మ గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన వారిలో సిద్దయ్య, మణి, సూరిబాబు, గురవయ్య, చంద్రయ్య, లక్ష్మయ్య, బాలకృష్ణ, సుబ్రమణ్యం, సూరయ్య, బాలయ్య ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభురాజు, గంగాధరం, గూళూరు కరుణ, నాని, హరితారెడ్డి పాల్గొన్నారు.

శాంతిపురంలో..



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: మండలంలోని మఠం పంచాయతీ వెంకటేష్‌పురానికి చెందిన టీడీపీ, జనసేన నేతలు సుమారు 40 మంది వారి కుటుంబాలతో సహా వైఎస్సార్‌సీపీలో చేరారు. కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్‌జే భరత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వివక్ష చూపకుండా సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకునేందుకే వైఎస్సార్‌సీపీలోకి వచ్చినట్లు వెల్లడించారు. టీడీపీ జెండా మోయాలనే పవన్‌కల్యాణ్ తీరుకు నిరసనగా జనసేనను వీడి వైఎస్సార్ సీపీలో చేరినట్లు జనసైనికులు తెలిపారు. భరత్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలని కోరారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, స్థానిక నాయకులు సల్లాపురి, చంగల్రాయుడు, మురుగేష్ పాల్గొన్నారు.

పలమనేరులో..



వైఎస్సార్‌సీపీలో చేరిన సిమ్రాన్‌తో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు : పట్టణంలోని బొమ్మిదొడ్డికి చెందిన టీడీపీ నాయకుడు సిమ్రాన్ (సుబ్రమణ్యం) ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే సోమవారం టీడీపీ నేతలు బలవంతంగా పచ్చ కండువాలు కప్పిన వి.కోట మండలం గోనుమాకులపల్లె వార్డు సభ్యులు శివ, హరికృష్ణ సైతం మళ్లీ సొంత గూటికి చేరుకున్నారు. వీరిని ఎమ్మెల్యే వెంకటేగౌడ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు చెంగారెడ్డి, గజేంద్ర, కృష్ణారెడ్డి, నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.



సొంతగూటికి చేరుకున్న నాయకులతో ఎమ్మెల్యే వెంకటేగౌడ

అలరించిన కవి సమ్మేళనం



కవులను సన్మానిస్తున్న నిర్వాహకులు

పలమనేరు : పట్టణంలోని కళాక్షేత్రంలో మంగళవారం ఉగాది పండుగను పురస్కరించుకుని నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. పలమనేరు రచయితల సంఘం, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మేళనానికి పలువురు కవులు హాజరై తమ కవితలను వినిపించారు. వారు మాట్లాడుతూ భాష, సంస్కృతిని సంరక్షించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కవులు మాధవరెడ్డి, శ్రీరామచంద్రమూర్తి, సీతారామయ్య, మురళి, చంద్రశేఖరయ్య, కుమారస్వామి రెడ్డి, సిద్దార్థ, ప్రసన్నలక్ష్మి, యుగంధర్ బాబు, మురళీనాథ్, గిరిధర్‌మూర్తి, వీరభద్రగౌడను నిర్వాహకుడు తులసీనాథం నాయుడు ఘనంగా సత్కరించారు. సన్మానించారు.

క్లుప్తంగా

'కోడ్' నిబంధనలు బేఖాతర్!



చిత్తూరులో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించడం ఎన్నికల అధికారుల ప్రాథమిక విధి. టీడీపీ నాయకులు నగరంలోని ఐటీఐకు వెళ్లే దారిలో రూరల్ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారి పక్కనే ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా మూడు బ్యానర్లు ఏర్పాటు చేశారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి పేరుతో నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న ఫ్లెక్సీలను తొలగించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం విమర్శలకు తావిస్తోంది.

ఇంగ్లిష్ స్పీకింగ్‌లో ఉచిత శిక్షణ

– 'మేధా ఇన్‌స్టిట్యూట్' ఫౌండర్ చిరంజీవి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచీ ఇంగ్లీషు మీడియాన్ని అందుబాటులోకి తేవటం ప్రశంసనీయమని 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్' వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లిష్‌పై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని చెబుతూ.... ఆసక్తి ఉన్నవారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లీషు స్పీకింగ్ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. 'మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లీష్ కార్యక్రమాన్ని తలపెట్టాం. ఆన్‌లైన్లో ఉచితంగా అందజేస్తాం' అని చెప్పారాయన. ఈజీ ఇంగ్లీష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. 'ఈ కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం దిగువ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింకు వస్తుంది. లేనిపక్షంలో 9866006662 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం' అని వివరించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

'ఈవీఎం' అనే నేను.. ఇలా పనిచేస్తాను!



ఈవీఎంలలో ఓటు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న జేసీ శ్రీనివాసులు

క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాం



ఈవీఎంల వినియోగంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాం. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో డమ్మీ ఈవీఎంలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలను పకడ్బందీ బందోబస్తు నడుమ భద్రపరిచాం. ఎన్నికల నిబంధనల మేరకు ర్యాండమైజేషన్ల ప్రక్రియ పూర్తి చేస్తాం.

– షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి

ప్రపంచవ్యాప్తంగా పలు అభివృద్ధి చెందిన దేశాలు ఈవీఎంలను వినియోగిస్తున్నాయి. మన దేశంలో ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకువచ్చిన ఈవీఎంలు ప్రత్యేకమైనవి. వీటి అంతర్గత భద్రత, రక్షణ, పకడ్బందీగా ఉంటాయి. నెట్‌వర్క్‌లతో నియంత్రించలేని పరిజ్ఞానంతో వీటిని రూపొందించారు. ఎన్నికల ప్రక్రియ అంతా పారదర్శకంగా ఓటర్లకు కళ్లముందు కనిపించేలా తీర్చిదిద్దారు. ఈవీఎంలలో మూడు భాగాలుంటాయి. ఒకటి కంట్రోల్ యూనిట్ (సీయూ), రెండోది బ్యాలెట్ యూనిట్ (బీయూ), మూడోది వీవీప్యాట్‌లు ఉంటాయి. ఈవీఎంల విశిష్టతపై సాక్షి ప్రత్యేక కథనం ..

- అందుబాటులో సాంకేతిక పరిజ్ఞానం
- సమయం.. శ్రమ.. కాగితం ఆదా
- జిల్లాలో ఎన్నికలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల వినియోగం

– అంధుల కోసం ప్రత్యేక గుర్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, చిత్తూరు పార్లమెంట్ స్థానానికి మే 13వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లా యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. అందులో భాగంగా ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) ద్వారా ఓటు వేసే విధానంపై అధికారులు క్షేత్రస్థాయిలో ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పించారు. పోలింగ్ రోజున ఈవీఎంలను వినియోగించే విధానంపై ప్రిసైడింగ్ అధికారుల (పీఓ)కు సైతం శిక్షణ ఇచ్చారు.

పీఓ వద్ద కంట్రోల్ యూనిట్

ఈవీఎంలో ప్రధానంగా రెండు యూనిట్లు ఉంటాయి. ఒకటి కంట్రోల్ యూనిట్, రెండోది బ్యాలెట్ యూనిట్. ఈ రెండింటిని ఐదు మీటర్ల కేబుల్ అనుసంధానం చేస్తుంది. పీఓ వద్ద కంట్రోల్ యూనిట్ ఉంటుంది. బ్యాలెట్ యూనిట్‌ను ఓటరు ఓటు వేయడానికి వీలుగా నిర్దేశించిన ప్రదేశంలో ఉంచుతారు. కంట్రోల్ యూనిట్‌లోని బ్యాలెట్ బటన్ ద్వారా పీఓ అనుమతించిన తర్వాత ఓటరు బ్యాలెట్ యూనిట్‌లో ఓటు వేయడానికి వీలవుతుంది. ఒక ఓటరు ఒక ఓటు మాత్రమే వేయగలరు. ఓటు వేసిన వెంటనే కంట్రోల్ యూనిట్‌లోని బ్యాలెట్ బటన్ లాక్ అవుతుంది. దీంతో మరోసారి ఓటు వేసేందుకు వీలుండదు.

జిల్లాలో ఎన్నికలకు వినియోగించే మిషన్ల సమాచారం

కేటగిరీ	పార్లమెంట్ సెగ్మెంట్	అసెంబ్లీ సెగ్మెంట్	మొత్తం
బ్యాలెట్ యూనిట్	2,348	2,360	4,708
కంట్రోల్ యూనిట్	2,263	2,263	4,526
వీవీప్యాట్	2,541	2,541	5,082

అంధుల కోసం..

బ్యాలెట్ యూనిట్‌లో అంధుల కోసం ప్రత్యేకంగా బ్రెయిలీ లిపితో కూడిన గుర్తులు ఉంటాయి. ఓటు వేసే నీలి రంగు బటన్ పక్కన బ్రెయిలీ లిపితో సంఖ్య ఉంటుంది. చేతి వేళ్లతో తడిమితే స్పష్టంగా గుర్తు పట్టవచ్చు. తాము ఓటు వేయాలనుకున్న అభ్యర్థి వరుస సంఖ్య ఆధారంగా అంధులు సులభంగా ఓటు వేయవచ్చు.

ఓటును చూపే వీవీప్యాట్!

ఎన్నికల్లో ఈవీఎంలపై మరింత నమ్మకాన్ని, పోలింగ్ ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు ఎన్నికల సంఘం వీవీప్యాట్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. 2017 తర్వాత అన్ని ఎన్నికల్లో వీటిని వినియోగిస్తున్నారు. ఓటరు తాను ఓటు వేసిన వ్యక్తికే ఆ ఓటు పడిందో లేదో పరిశీలించుకోవడానికి అనుకూలంగా తయారు చేసిన యంత్రం వీవీప్యాట్. నీలి బటన్ నొక్కి ఓటు వేసిన తర్వాత పక్కనున్న వీవీప్యాట్‌లో ఒక చీటీ ముద్రించి కనిపిస్తుంది. ఈ చీటిలో ఓటరు వేసిన అభ్యర్థి క్రమసంఖ్య, పేరు, గుర్తు ఉంటాయి. ఈ చీటి కేవలం ఏడు సెకన్లు మాత్రమే కనిపిస్తుంది. అనంతరం ఆ చీటి కట్ అయ్యి వీవీప్యాట్‌లోని పెట్టెలో పడిపోతుంది.

42 ఏళ్ల చరిత్ర

స్వతంత్ర భారతావనిలో ఎన్నికలను తొలుత పేపర్ బ్యాలెట్ ద్వారా నిర్వహించేవారు. అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు ఈవీఎంలను ప్రవేశపెట్టారు. దీంతో పోలింగ్ సమయం ఆదాతో పాటు ఓట్ల లెక్కింపు శరవేగంగా పూర్తవుతుంది. ఇవి అందుబాటులోకి వచ్చి 42 ఏళ్లు దాటింది. 1982లో తొలిసారిగా కేరళలోని పరూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించారు. 1982–83లో జరిగిన ఉప ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 10 నియోజకవర్గాల్లో ఈవీఎంల ద్వారా ఓటు హక్కును ప్రజలు వినియోగించుకున్నారు. 1984, ఆగస్టులో ఈవీఎంలను వినియోగించరాదంటూ సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. 1988, డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం సెక్షన్ 81–ఏ ను ప్రజాప్రాతినిధ్య చట్టంలో చేర్చింది. ఈ సవరణ అనంతరం పరిశీలన తర్వాత ఈవీఎంలతో ఓటింగ్ ప్రక్రియకు సుప్రీంకోర్టు అనుమతించింది. 1990లో సాంకేతిక నిపుణుల కమిటీ ఈవీఎంల వాడకానికి సిఫార్సు చేసింది. 1998లో ఈవీఎంల వాడకంపై ప్రజామోదం లభించింది. 1999–2004 మధ్యలో వివిధ రాష్ట్రాలకు జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఈవీఎంలను పూర్తి స్థాయిలో వాడారు. 2013 నాగాలాండ్‌లోని నాక్సెన్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో వీవీప్యాట్‌లను (ఓటర్ వెరిఫయేబుల్ పేపర్ అడిట్ ట్రయల్) మొదటిసారిగా వినియోగించారు. 2013లో సుప్రీం కోర్టు దశలవారీగా వీవీ ప్యాట్లను వినియోగంలోకి తేవాలని ఆదేశించింది.

ఇదేందయ్యా సామీ..?

- రికార్డింగ్ డాన్స్ చేసిన టీడీపీ అభ్యర్థి
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- పరువుపోయిందని తలలు పట్టుకుంటున్న తమ్ముళ్లు



రికార్డింగ్ డాన్స్ చేస్తున్న చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జగన్‌మోహన్‌నాయుడు

చిత్తూరు అర్బన్: చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ నాయుడు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో అభాసుపాలవుతున్నారు. ఇటీవల ఓ బైకు నడిపిన ఆయన రెండు చేతులు వదిలేస్తూ.. జాతీయ రహదారిపై చేసిన స్టంట్లు, దాన్ని వీడియోలు తీయించి వైరల్ చేసిన తీరు చూసి జనం నవ్వుకున్నారు. దీనిపై యువత తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం, హెల్మెట్ పెట్టుకోకపోవడం, కనీసం రోడ్డుపై స్టంట్లు చేసేప్పుడు పోలీసుల అనుమతి తీసుకోవాలనే అవగాహనలేకపోవడం ఏంటని విద్యావంతుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వివాదం నుంచి బయటపడకముందే తాజాగా ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇందులో జగన్‌మోహన్ నాయుడు రికార్డింగ్ డ్యాన్సు చూస్తూ కనిపించారు. ఇద్దరు యువతులతో కలిసి ఆయన వేసిన కుప్పిగంతులు చూపరులకు వెగటుపుట్టిస్తున్నాయి. బెంగళూరులో డిస్కోలు, పబ్బులు, మద్యం బార్లలో పిచ్చి గంతులు వేసే వ్యక్తి, బాధ్యతారహితంగా వ్యవహరించే మనిషి నాయకుడైతే ఎలా ఉంటుందో తెలుసుకోండి..! అంటూ పలువురు ఈ వీడియోలను ట్రోల్ చేశారు. సైకిల్ పోవాలి అనే హ్యాష్ ట్యాగ్‌తో ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ కార్యకర్తలు అంతర్మథనంలో పడ్డారు. తమ అభ్యర్థి నిర్వాకాలతో పార్టీ పరువు బజారున పడిందని తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారు. భవిష్యత్‌లో సదరు అభ్యర్థి ఇంకేం వీడియోలతో నవ్వులపాలు చేస్తాడో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'చెత్త' రాజకీయాలు సిగ్గుచేటు




మాట్లాడుతున్న గాయత్రీదేవి, జ్ఞానజగదీష్

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని లెనిన్‌నగర్ డంపింగ్‌యార్డ్‌లో సోమవారం సంభవించిన అగ్ని ప్రమాదంపై టీడీపీ నాయకులు ×చెత్త¥ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ మాజీ జిల్లా మహిళా అధ్యక్షులు గాయత్రీదేవి, నగర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ మండిపడ్డారు. మంగళవారం చిత్తూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. డంపింగ్ యార్డులో ప్రమాదం జరిగితే వైఎస్సార్‌సీపీ నాయకులను విమర్శించడమేంటన్నారు. దశాబ్దాల సమస్యపై టీడీపీ అభ్యర్థికి అవగాహన లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. వారికి సబ్జెకు నిల్ అని.. పబ్లిసిటీ మాత్రం ఫుల్‌గా కావాలని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో డంపింగ్‌యార్డ్ ప్రహరీగోడ నిర్మించారని గుర్తు చేశారు. జగనన్న పాలనలో అక్కడ నుంచి యార్డును బండపల్లెకు మార్చేందుకు ప్రయత్నించగా, స్థానికులు కోర్టుకు వెళ్లారని వెల్లడించారు. ప్రమాదం జరిగిన కొన్ని నిమిషాల్లోనే నగరపాలక కమిషనర్ అక్కడకు చేరుకొని నష్ట నివారణ చర్యలు చేపట్టారన్నారు. అగ్నిమాపక వాహనాలు వచ్చి మంటలను అదుపు చేశాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి వెంటనే స్పందించి పరిసర కాలనీల వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించి భోజన సదుపాయం కల్పించారని వివరించారు. అయితే ప్రజాసంక్షేమమే తప్ప పబ్లిసిటీపై వ్యామోహం లేని విజయానందరెడ్డి దీన్ని ప్రచారం చేసుకోలేదని చెప్పారు. అయితే తీరిగ్గా ఘటనాస్థలానికి రాత్రి చేరుకున్న టీడీపీ అభ్యర్థి ఇష్టారాజ్యంగా కమిషనర్, తమ పార్టీ నాయకులపై విమర్శలు గుప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ పాలనలో డంపింగ్‌యార్డును ఎందుకు మరో ప్రాంతానికి తరలించలేకపోయారని ప్రశ్నించారు. ఇవేమీ తెలియకుండా నోటికొచ్చినట్లు మాట్లాడడం టీడీపీ నాయకులకే చెల్లిందన్నారు. రాబోయే ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత డంపింగ్‌యార్డు మార్పు, సంతపేటలో నవోదయ పాఠశాల ఏర్పాటు, మంగసముద్రం హౌసింగ్‌కాలనీ అభివృద్ధి చేస్తామని విజయానందరెడ్డి గతంలోనే హామీ ఇచ్చారని వెల్లడించారు. పదవులను అనుభవించడం తప్ప పనిచేయడం తెలియని నాయకులను పక్కన పెట్టుకొని టీడీపీ అభ్యర్థి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు ద్వారక, గోపి పాల్గొన్నారు.

డిబేట్ల సవారీ

దర్శనాల దళారీ!



- శ్రీవారి దర్శనాల పేరుతో వసూళ్లు
- వీఐపీ, వీవీఐపీలొస్తే.. వారి అడుగులకు మడుగులు
- బ్రేక్ దర్శనాలు ఇవ్వకపోతే టీటీడీపై విమర్శలు
- తనకు మించిన మేధావి లేడంటూ.. తరచూ మీడియాలో చర్చలు
- నోటా ఓట్లతో కూడా పోటీపడలేని వ్యక్తి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానంటూ గొప్పలు
- తిరుపతిలో ఆయనపై షికార్లు కొడుతున్న పుకార్లు

నేను పోటీ చేస్తున్నా.. విరాళం ఇవ్వండి

'ఈ సార్వత్రిక ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నా. సీటు ఖరారు అయ్యింది. ఎన్నికల ఖర్చు కోసం విరాళాలు ఇవ్వాలి' అని ఏపీతో పాటు, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన ప్రముఖ వ్యాపారులు, పారిశ్రామిక వేత్తల నుంచి భారీగా వసూళ్లు చేశాడన్న వార్త తిరుపతిలో రెండు రోజులుగా చక్కర్లు కొడుతోంది. ఓ వ్యాపారి వద్ద రూ.2 కోట్లు, చెన్నైకి చెందిన పారిశ్రామిక వేత్త నుంచి రూ.3 కోట్లు, తిరుపతిలోని పలువురు వ్యాపారుల నుంచి రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయం ఇప్పుడు బయటకు రావడానికి ప్రస్తుతం అతను అభ్యర్థిగా బరిలో లేకపోవడమే. ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ ఇవ్వలేదు కదా.. తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వండి ప్లీజ్ అని అడుగుతుంటే ఆ గల్లీ లీడర్, దళారి తప్పించుకు తిరుగుతున్నాడని సమాచారం. ఫోన్ చేస్తే తియ్యడం లేదని చెప్పుకుంటున్నారు.

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో పే..ద్ద రాజకీయ నాయకుడినని చెప్పుకుంటూ దేవుడి దర్శనాల పేరుతో భారీగా డబ్బులు సంపాదించాడు. ఢిల్లీ లేదా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వీఐపీ, వీవీఐపీల వెనుకే పాతుకుపోతాడు. గతంలో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగి నోటాకు వచ్చినన్ని ఓట్లు కూడా రాని ఆ దళారీ.. ఇప్పుడు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానంటూ పలువురు వ్యాపారులు, పారిశ్రామిక వేత్తల నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఓ ప్రముఖ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు.. కాదు కాదు.. గల్లీ నాయకుడు.. అయిన అతను తరచూ టీవీ డిబేట్లలోనే ఎక్కువగా కనిపిస్తుంటాడు. ఒకప్పుడు చంద్రబాబుని తిట్టేవాడు. ఇప్పుడు అధికార పార్టీని టార్గెట్ చేసి విమర్శలు గుప్పిస్తున్నాడు. అదేవిధంగా టీటీడీపై ఏదో ఒక దుష్ప్రచారం చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. అందుకు కారణం లేకపోలేదు. అతను ఎప్పుడు అడిగితే అప్పుడు అడిగినన్ని బ్రేక్ దర్శనాలు ఇవ్వాలి. అలా ఇవ్వకపోతే టీటీడీపై లేనిపోని ఆరోపణలు చేయడం అలవాటుగా చేసుకున్నాడు. అందుకోసమే ఉన్న ఎల్లో మీడియా అతన్ని పిలిచి డిబేట్లలో మాట్లాడించి రాక్షసానందం పొందుతోంది.

ఏడాదికి 300 లెటర్లా..?

ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన ఈ దళారి తిరుమల శ్రీవారి దర్శనాలను అడ్డు పెట్టుకుని ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగారు. గతంలో ఏడాదికి శ్రీవారి బ్రేక్ దర్శనాల కోసం 300 లెటర్లు పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఇతను గతంలో టీటీడీ బోర్డు సభ్యునిగా కూడా ఉన్నాడు. ధర్మకర్త పదవి అడ్డుపెట్టుకుని పలుకుబడి గలవారు, సంపన్నులు స్వామి దర్శనానికి వస్తే వారి వెంటే ఉండి దళారీ పనిచేయడం వృత్తిగా మార్చుకున్నాడనే ప్రచారం ఉంది. టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉన్న సమయంలో తిరుపతిలోని ఆ పార్టీ కార్యకర్తలకు గానీ, నాయకులకు గానీ ఒక్క దర్శనం టికెట్ కూడా ఇప్పించకుండా కోటా టికెట్లన్నీ గంపగుత్తగా స్టార్ హోటళ్లకు అమ్మేసిన వైట్ కాలర్ దళారీగా మారాడు. ఈ దళారీ వ్యాపారానికి ప్రస్తుతం టీటీడీ చెక్ పెట్టడంతో చైర్మన్, ఈఓపై కక్ష పెంచుకుని బ్లాక్ మెయిల్ చర్యలకు పాల్పడుతున్నారు. ఇది టీటీడీ ఉద్యోగులకు తీవ్ర ఆగ్రహం తెప్పిస్తోంది. నాడు బోర్డు మెంబర్‌గా ఉన్న రెండేళ్లలో ఏ రోజూ తిరుమలలో భక్తుల సదుపాయాలు, అభివృద్ధి గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పోనీ తిరుపతి లో ఆ పార్టీ బలోపేతం చేయడానికైనా పనిచేశారా అంటే అదీ లేదు. చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్న సమయంలో పి.బాలసుబ్రహ్మణ్యం అనే ఐఏఎస్ అధికారిని తొమ్మిదేళ్లకంటే ఎక్కువ కాలం తిరుమల జేఈవోగా కొనసాగారు. అప్పట్లో మూడు ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో ఎప్పుడూ కూడా బాలసుబ్రహ్మణ్యంను 9 సంవత్సరాలకు పైగా ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించిన పాపాన పోలేదు. మరో ఐఏఎస్ అధికారి శ్రీనివాసరాజును కూడా ముఖ్యమంత్రులు కిరణ్ కుమార్‌రెడ్డి, చంద్రబాబునాయుడు 9 సంవత్సరాలకు పైగానే తిరుమల జేఈవోగా కొనసాగించారు. ఆయన హయాంలో కూడా రెండు సార్లు శాసనసభ ఎన్నికలు జరిగాయి. అప్పుడు కూడా నోరెత్తలేదు. అటు వంటి దళారీ టీటీడీ ఈఓ మీద బురద చల్లడంతో పాటు టీటీడీని బజారుకు లాగే ప్రయత్నం చేస్తున్నారు. టీటీడీలో పనిచేస్తున్న అధికారులు ఎన్నికల ప్రక్రియలో ఎక్కడ పాల్గొనరు. కాబట్టి వారు ఎన్నికల బదిలీల పరిధిలోనికిరారు. ఈ విషయం తెలిసినా ఈఓని బదిలీ చేయాలని మీడియాలో రగడ చేస్తూ చీప్ పబ్లిసిటీ పొందే ప్రయత్నం చేస్తుండడంపై టీటీడీ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈఓని మార్పించేస్తా!

తను అడిగినప్పుడు బ్రేక్ దర్శనాల అనుమతివ్వడం లేదనే కక్షతో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డిపై గత కొంత కాలంగా ఆరోపణలు చేస్తున్నారు. తిరుపతి అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతూ... లేని పోనివి కల్పించి దుష్ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. అంతటితో ఆగని ఆ దళారీ డబ్బులు గుంజుకోవడంతో పాటు.. తనకు అడ్డుపడుతున్న టీటీడీ ఈఓని బదిలీ చేయించే కుట్రలకు తెరలేపాడు. అందుకు టీడీపీ, జనసేన నేతలను పావుగా వాడుకుంటున్నాడు. ఈఓ ఉంటే ఎన్నికలకు ఇబ్బంది అవుతుందని వారిని నమ్మించే ప్రయత్నం చేశాడు. ఈఓని మార్చాలంటే ఖర్చు అవుతుందని, ఢిల్లీ వెళ్లాల్సి ఉంటుందని, భారీగా ఖర్చు అవుతుందని జనసేన అభ్యర్థిపై ఒత్తిడి తెస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.